సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 3 । జనవరి । 2025



మారని కూటమి నాయకుల తీరు

కూటమి నాయకుల తీరు మారలేదు. మండల్ మీట్ జరపడానికి హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా.. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోఅధికారులు సమావేశాన్ని వాయిదా వేశారు. -8లో



ఆస్పత్రి ఎదుట మృతదేహంతో నిరసన

వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి వస్తే సిబ్బంది రోగిని.. ఆస్పత్రిలోకి తరలించడానికి రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతదేహంతో బంధువులు నిరసన తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. 150 మంది స్టాఫ్ నర్స్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాను సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు. భర్తీ చేసిన దరఖాస్తుతోపాటు నిర్దేశించిన రుసుము, సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి ఈనెల 3 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లో గల వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

నేటి నుంచి మాచుపల్లె దర్గాలో ఉరుసు మహోత్సవం

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపం ఉన్న హజరత్ సయ్యద్ షావలి దర్గాలో శుక్రవారం నుంచి ఉరుసు మహోత్సవం జరుగుతుంది. ఈ విషయాన్ని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ గురువారం తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు గంధం మహోత్సవాన్ని పూల చాందినీలో ఊరేగిస్తారన్నారు.అనంతరం ఫాతేహా నిర్వహిస్తారన్నారు. శనివారం రాత్రి ఉరుసు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉరుసు రోజు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆదివారం ఉదయం తహలీల్ ఫాతేహా జరుతుందని చెప్పారు. అందరూ ఉరుసు మహోత్సవంలో పాల్గొనాలని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ కోరారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె: ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్యజిల్లా వైద్యాధికారి కొండయ్య గురువారం పేర్కొన్నారు. మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలో 104 సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సచించారు.

ఏఎన్‌ఎం సస్పెన్షన్

రాయచోటి అర్బన్: రాయచోటి మున్సిపల్ పరిధిలో జరిగిన ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ పథకంలో అతినీతికి పాల్పడిన ఏఎన్‌ఎంపై జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.గత నెల 31న జిల్లాలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కొందరు అవినీతికి పాల్పడినట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విచారణలో మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు ఏఎన్‌యం పింఛన్‌దారులు ఒకొక్కరి నుంచి రూ. 100లు చొప్పున వసూలు చేసినట్లు తేలింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్ అంద చేసిన నివేదిక ఆధారంగా సదరు ఏఎస్‌ఎంను డీఎంహెచ్ఓ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి కార్యక్రమాల్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

రాజంపేట టౌన్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటి నుంచే ఓ ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని డీఈఓ కె.సుబ్రమణ్యం హెడ్‌మాస్టర్లు(హెచ్‌ఎం) సూచించారు. రాజంపేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్‌ఎంసీ సమావేశంలో డీఈఓ పాల్గొని హెచ్‌ఎంలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. డ్రాప్ అవుట్స్ లేకుండా చూడటం, విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలను బాగా చదివేలా ఉపాధ్యాయుల బోధనలు ఉండే విధంగా హెచ్‌ఎంలు మానిటరింగ్ చేస్తూ ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే వారి పిల్లలు బాగా చదవగలరన్న విషయాన్ని వారికి తెలియ చేయాలని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఎంఈఓ కొండూరు రఘునాధ్‌రాజు, రీసోర్స్ పర్సన్లు మల్లు నరసారెడ్డి, ఎం.ఓబులేసు, జీ.నాగేంద్ర, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

చేపకు వేళాయె!

- జిల్లాలో నీళ్లున్న రిజర్వాయర్లలో చేపల పెంపకానికి కసరత్తు
- ప్రస్తుతం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 16 లక్షల చేప పిల్లల పెంపకం
- మరో నాలుగు లక్షల పిల్లల సరఫరాకు అర్హుల నుంచి దరఖాస్తులు
- అంతకుముందు వైఎస్సార్ సీపీ హయాంలో చేపల పెంపకానికి తోడ్పాటు



సాక్షి రాయచోటి: చేపలు వస్తున్నాయి...పిల్లల పెంపకానికి సమయం వచ్చింది....ఇక్కడ స్థానికంగా పెంచుకుంటున్న వాటిని వదిలేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు పడడంతో చెరువులతోపాటు ప్రాజెక్టుల్లో నీరు ఉండడంతో జిల్లాలో మత్స్య సంపద పెంపునకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో కూడా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రత్యేకంగా ఫిష్ ఆంధ్ర పేరుతో కేంద్రాలు ఏర్పాటు చేసి చికెన్.. మటన్‌తో సమానంగా చేపను అందుబాటులోకి తెచ్చారు. అంతేకాకుండా మత్స్యకారులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా చేప పిల్లల ఉత్పత్తికి కూడా జిల్లాలో చర్యలు చేపట్టారు. జిల్లాలో ఉన్న వనరుల మేరకు వెలిగల్లు, సోమశిల బ్యాక్ వాటర్‌తో పాటు మరికొన్ని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. అందుకు సంబంధించి ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు పిల్లల ఉత్పత్తికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశారు.

వెలిగల్లు ప్రాజెక్టు, సోమశిల బ్యాక్ వాటర్‌లో...

జిల్లాలో ఆశించిన మేర వర్షాలతోపాటు వరదలు రావడంతో ఎక్కడికక్కడ ప్రాజెక్టులు నీటితో నిండుగా ఉన్న కొన్ని చెరువుల్లో మాత్రమే చేప పిల్లలను వదలనున్నారు. అయితే కొత్త సర్కార్ నిధులు కేటాయించకపోవడంతో జిల్లాలోని నీరు ఉన్న అన్ని చెరువుల్లో కాకుండా ఆరు చెరువుల్లో మాత్రమే వదిలేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా వెలిగల్లు ప్రాజెక్టుతోపాటు సోమశిలలోనే పెద్ద సంఖ్యలో పిల్లలను వదలనున్నారు. 2022-23లో మత్స్య కేంద్రాల్లో పెంచిన 50 లక్షల పైచిలుకు వరకు చేప పిల్లలను వదిలారు. చేపలు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడం ద్వారా మత్స్యకారులకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

20 లక్షల చేప పిల్లలను వదిలేందుకు సన్నాహాలు



జిల్లాలోని పలు ప్రాజెక్టుల్లో చిరు చేప పిల్లలను ఫిబ్రవరి నెలలో వదిలేందుకు మత్స్యశాఖ అడుగులు ముందుకు వేస్తోంది. ప్రధానంగా రాజంపేట, పీలేరు, బహుదా (నిమ్మనపల్లె) వద్ద చేపల పెంపకం కేంద్రాల్లో సుమారు 16 లక్షల చేప పిల్లలను పెంచుతున్నారు. కొద్దిరోజుల తర్వాత ఫింగర్ లెన్స్ సైజు రాగానే వాటిని పెద్ద ప్రాజెక్టుల్లో వదలనున్నారు. చిరు చేపలను నెలన్నర నుంచి రెండు నెలలపాటు పెంచి తర్వాత ప్రాజెక్టుల్లో వదలడం ద్వారా వేగంగా పెరగనున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కూడా గతంలో పెద్ద ఎత్తున చేపల పెంపకం చేపడుతూ వచ్చారు. అయితే నూతన జిల్లాల ఆవిర్భావం తర్వాత కూడా పెంపకానికి సంబంధించిన లక్ష్యంలో ఏమాత్రం తేడా లేకుండా ఉత్పత్తి చేయాలన్న దిశగా వైఎస్ జగన్ సర్కార్ అడుగులు వేసింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో సరాసరిన కోటి పిల్లల వరకు అనేక ప్రాజెక్టుల్లో వదులుతూ వచ్చారు. ప్రస్తుతానికి 16 లక్షల చిన్న చేపలతోపాటు మరో 4 లక్షల చేప పిల్లలకు సంబంధించి సబ్సిడీపై సరఫరా చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు.ఈ నేపథ్యంలో జిల్లాలో ఈసారి 20 లక్షల పిల్లలను నీటిలో వదలాలన్నది అధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది.

టెండర్లను ఆహ్వానించాం



జిల్లాలో చేప పిల్లలను భారీగా వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే జిల్లాలోని పలు కేంద్రాల్లో సుమారు 16 లక్షల చేప పిల్లలను పెంచుతున్నాం. మరో నాలుగు లక్షల పిల్లలు సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానించాం. జనవరి 26 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు టెండరు ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చాం. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రానున్న కాలంలో మరికొన్ని లక్షల చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.సుస్మిత, జిల్లా మత్స్యశాఖ అధికారి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే ఆకాంక్ష

- కేంద్ర శాస్త్ర సాంకేతిక భూ శాస్త్ర మంత్రి జితేంద్ర సింగ్



మహిళకు ఆరోగ్య హెల్త్ కార్డును అందజేస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

కడప సెవెన్‌రోడ్స్/చింతకొమ్మదిన్నె /జమ్మలమడుగు: వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని.. ఆ దిశగా అధికారులు కృషి చేయాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక భూ శాస్త్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యాస్పిరేషనల్ బ్లాక్ కింద వైఎస్ఆర్ జిల్లాలో ఎంపికైన సీకే దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో గురువారం మంత్రి పర్యటించారు.

ఆకాంక్ష బ్లాక్‌ల అభివృద్ధిపై కేంద్రీకరణ

ఆకాంక్ష జిల్లాలోని బ్లాక్‌ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్నామని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌కు జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆకాంక్షిత జిల్లా కార్యక్రమం కింద ఆరోగ్యం-పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం, జల వనరులు, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్, ప్రాథమిక మౌలిక వసతులు తదితర అంశాలలో జరుగుతున్న ప్రగతిని గురించి తెలిపారు. వ్యవసాయం ద్వారా జీవీఏ 16,817 కోట్లు, పారిశ్రామికరంగం వాటా 12,975 కోట్లు, సర్వీసు సెక్టార్ ద్వారా 18,756 కోట్లు ఉందని వివరించారు.

సీకే దిన్నెలో పర్యటన

కేంద్ర మంత్రి తన మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లె, బుగ్గలపల్లె గ్రామాలను సందర్శించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, మందుల స్టాకు వివరాలు, ఓపీ నమోదు సంఖ్య వంటివి అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పనితీరును ఆయన ప్రశంసించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, పసి పిల్లల పోషణపై ఆరా తీశారు. రైతు గుత్తిరెడ్డి శివారెడ్డి డ్రిప్ ద్వారా సాగు చేసిన అరటి తోటను సందర్శించారు. నమో డ్రోన్ దీదీ లబ్ధిదారుతో మాట్లాడిన కేంద్ర మంత్రి డ్రోన్ ద్వారా మందుల పిచికారీని పరిశీలించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి తెలిపారు. జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలో ఆయన స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ప్రతి మండలంలో చురుగ్గా ఉన్న ఎస్‌హెచ్‌జీ గ్రూపులను గుర్తించి వారిని ఈ-కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కూడా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

గండికోట సందర్శన

వైఎస్ఆర్ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన గండికోటను కేంద్ర మంత్రి సందర్శించారు. అక్కడి గాడ్జి, ఇతర చారిత్రక కట్టడాలను సందర్శించారు. గండికోట అభివృద్ధికి చేపడుతున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి , ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కేంద్ర మంత్రి పీఏ పంకజ్ దీక్షిత్, పీఐబీ డైరెక్టర్ నందకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత హామీని నిలబెట్టుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు: గ్రామ వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ రూ. 10 వేలు వేతనంతో ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి డిమాండ్ చేశారు.గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, వలంటీర్ల వేతన బకాయిలను త్వరితగతిన చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. లేనిపక్షంలో వలంటీర్లు చేపట్టే దీక్షలకు, ధర్నాలకు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు తెలుపుతామని చెప్పారు.కార్యక్రమంలో అరిగెల సౌమిత్రి, గుండు మల్లికార్జున రెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సిపి అధికార ప్రతినిధి విశ్వనాథ్ రెడ్డి, సుబ్బరాజు , దండుగోపి, నాగసుబ్బయ్య, శంకర, కళ్యాణ్ రెడ్డి, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, ఎన్టీఆర్ కాలనీ హరి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయచోటి: రాయచోటి పట్టణం మదనపల్లె మార్గం సమీపంలో అక్రమరవాణాకు సిద్ధం చేస్తున్న పీడీఎస్ బియ్యం ప్యాకెట్లను ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లె మార్గంలో ఉన్న షామీర్ కల్యాణ మండపం సమీపంలోని నివాసగృహంలో పక్క రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తుండగా 210 బియ్యం ప్యాకెట్లతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులకు అప్పగించి తదుపరి విచారణను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని బియ్యం పట్టుకున్న అధికారులు తెలిపారు

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి

లక్కిరెడ్డిపల్లి: ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సద్దల అహల్య అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కాకుండా త్వరితగతిన ప్రజలకు అందించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, విస్తరణ అధికారి ఉషారాణి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి

పింఛన్ల ధ్రువీకరణ పరిశీలన పక్కాగా చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో దివ్యాంగుల పెన్షన్ల ధ్రువీకరణ పరిశీలన కార్యక్రమాన్ని పక్కగా చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సేర్ప్ సీఈఓ వీరపాండ్యన్, సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నూతన మార్గదర్శకాలపై జిల్లా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య, మున్సిపల్ జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నిమిత్తం జిల్లా స్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వీరి ఆధ్వర్యంలో వివిధ మండలస్థాయి బృందాలను ఏర్పాటు చేస్తారన్నారు. వీరిలో 85శాతం, 40 శాతం పైబడిన రెండు కేటగిరిల్లో పరిశీలన పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1600 మంది వరకు 85శాతం పైబడి వికలత్వం కల్గిన వారు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. నియోజకవర్గం వారిగా ఆయా మండలంలో ఏ ఏగ్రామంలో ఎన్నెన్ని పెన్షన్లు ఉన్నాయన్న సమాచారాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మార్గదర్శకాల మేరకు బృందాల ఏర్పాటు నిమిత్తం డీఎంహెచ్ఓ, డీసీహెచ్, కడప జీజీ హెచ్ సూపరిటెండెంట్‌లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్య పంచాయతీ, డీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకప్రియులకు షాక్!


- బుక్ పోస్టు సర్వీసు పేరు మార్చిన తపాలాశాఖ
- భారీగా పెంచిన సేవల ధరలు
- ఉత్వర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్రమంత్రికి వినతిపత్రాలు పంపిన రచయితలు



పుస్తకావిష్కరణ చేస్తున్న మరసం సభ్యులు(ఫైల్)



మదనపల్లెలోని ప్రధాన తపాలా కార్యాలయం



మదనపల్లె సిటీ: చిన్నపాటి అక్షరాన్ని మార్చి...సరఫరా ధరను భారీగా పెంచిన కేంద్రప్రభుత్వ నిర్ణయం పుస్తకప్రియుల పాలిట శరాఘాతమైంది. తపాలాశాఖకు చెందిన 'బుక్ పోస్ట్ ' సర్వీసును 'బుక్ పోస్టు'గా పేరు మార్చిన మోదీ సర్కారు ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనీయార్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలాశాఖ తాజాగా పుస్తక ప్రియులకు భారీగా షాక్ ఇచ్చింది.

ఇంత కాలం బుక్ పోస్ట్ సర్వీసు పేరుతో అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్‌పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్ పోస్టును 'బుక్ పోస్టు'గా మార్చి సేవల చార్జీని పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్టుకార్డులను కూడా ఒకే విభాగం కిందకు తెచ్చారు.

రిజిస్టర్ బుక్ పోస్టు కాలమ్‌ను గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి రహస్యంగా తొలిగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ షాక్‌కు గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన,వార,పక్ష పత్రికల బట్వాడాపై తీవ్ర ప్రభావం చూపనుంది.

జిల్లాలో 28 సంఘాలు..

జిల్లాలో సాహితీ, రచయితల సంఘాలు 28 వరకు ఉన్నాయి. సాహితీ సంఘాలు రచయితలు, కవులు ప్రతి నెల గ్రంథావిష్కరణ, పుస్తకావిష్కరణలు జరుగుతున్నాయి. మదనపల్లెలో మదనపల్లె రచయితల సంఘం(మరసం), సాహితీ కళావేదిక ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నవి. ఇక్కడ ప్రతి నిత్యం గ్రంథావిష్కరణలు,కవిసమ్మేళనాలు నిర్వహిస్తుంటారు.

అధిక ధరలు చెల్లించాలి

ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోల్చుకుంటే ఇప్పటి వరకూ తపాలాశాఖ చాలా తక్కువ ధర లతో వస్తు తరలింపు సేవలు అందిస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాలతో ప్రైవేటు సేవలే మేలు అనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార,పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్‌కు గతంలో రూ.80 చెల్లించేవారమని, ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ. 365 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. కేంద్రం నిర్ణయం ప్రచురణ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. రిజిస్టర్ బుక్‌పోస్టు ద్వారా రిజిస్టర్ బుక్ పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాలశాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పార్శిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా పోస్టులో తెప్పించుకోవాలంటే పుస్తక వెల రూ.100తో పాటు మరో రూ.80 పోస్టల్ ఛార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునే వారెవరుంటారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

5 శాతం దిగుమతి సుంకం..

కేంద్రం తీసుకున్న మరో నిర్ణయంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాపలైతొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి సుంకం విధించడం సమర్థనీయమే అయినా కాంప్లిమెంటరీ కాపీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం దుర్మార్గమేనన్న అభిప్రాయం వెల్లడవుతోంది.

పెరిగిన ధరలు ఇలా...

బుక్ పోస్టు బరువు	పాత ధర	కొత్తధర
100 గ్రాములు	రూ.22.00	రూ28.00
1000 గ్రాములు	రూ.27.00	రూ.92.00
2వేల గ్రాములు	రూ.43.50	రూ.163.00
3 వేల గ్రాములు	రూ.56.40	రూ.234.00
4 వేల గ్రాములు	రూ.67.00	రూ.304.00
5 వేల గ్రాములు	రూ.79.00	రూ.365.00

పాత ధరలనే కొనసాగించాలి



సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నిర్ణయం ఆవేదన కలిగిస్తోంది. కవులు, రచయితలు రాసిన పుస్తకాలను బట్వాడా చేయాలనుకుంటారు. బుక్‌పోస్టుల ధరలు పెంచడంతో పుస్తకాలు ఎలా పంపాలన్న ఆందోళన నెలకొంది. పాత ధరలకే కొనసాగించాలి. దీనిపై కేంద్ర మానవవనరులశాఖ మంత్రికి ప్రత్యేక వినతిపత్రాలు పంపనున్నాం.

–లింగాల యుగంధరాచారి, మరసం, ప్రధాన కార్యదర్శి, మదనపల్లె

పుస్తక పఠనానికి దూరం చేయడమే



కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు? తెప్పించుకునేదెవరు? చదివేదెవరు? ఇప్పటికైనా కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహించుకోవాలి.

–టీఎస్‌ఏ క్రిష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె

మారని కూటమి నాయకుల తీరు


పోలీసుల బందోబస్తుతో లోపలికి వెళ్తున్న ప్రజాప్రతినిధులు


మండల పరిషత్ కార్యాలయం ఎదుట పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కూటమి నాయకులు

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తిష్ట
- మళ్లీ మండల్ మీట్ వాయిదా
- హైకోర్టు ఉత్తర్వుల భేఖాతర్

ములకలచెరువు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారుల ఏకపక్ష ధోరణి, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో.. ములకలచెరువు ఎంపీపీ సాయిలీలా హైకోర్టును ఆశ్రయించగా సమావేశం జరిగేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ హరినారాయణకు సమర్పించడంతో.. ఈ నెల 2వ తేదీ జరిగేటట్లు సర్క్యులర్ జారీ చేశారు. దీంతో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీపీ, ఎంపీటీసీలు ఉదయం కార్యాలయం వద్దకు చేరుకోగానే.. కూటమి నాయకులు అప్పటికే మండల్‌మీట్ అడ్డుకోవడమే లక్ష్యంగా పక్కా ప్లానింగ్‌తో పెద్ద ఎత్తున చేరుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించినా ఎటువంటి ఫలితం లేకపోయింది. ప్రధాన గేటు వద్ద కూటమి నాయకులు అడ్డుగా నిలుచున్నారు. అనంతరం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు మండల పరిషత్ కార్యాలయంలోకి అతికష్టం మీద చేరుకున్నారు. సమావేశానికి ఆలస్యంగా చేరుకున్నారని దీనిపై జెడ్పీ సీఈఓ వాయిదా వేయాలని సూచించారని.. ఇందుకు ఈ నెల 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ బయటకు వచ్చేశారు. కోరం ఉందని, సమావేశం నిర్వహించాలని ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించినా.. ఎటువంటి ఫలితం లేకపోయింది. చేసేదేమీ లేక ప్రజాప్రతినిధులు బయటకు వచ్చేశారు.

హైకోర్టు ఉత్తర్వులు భేఖాతర్

మండల్ మీట్ నిర్వహించడానికి హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా.. అధికారులు మాత్రం అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో సమావేశాన్ని వాయిదా వేశారు. ఎంపీడీఓ హరినారాయణ కార్యాలయానికి ఉదయం 9.50 గంటలకు చేరుకున్నారు. 10 గంటలకు కార్యాలయం తలుపులు తెరిచారు. 9.30 గంటలకే ప్రజాప్రతినిధులు కార్యాలయం వద్దకు రాగానే.. అప్పటికే కూటమి నాయకులు కార్యాలయం గేటు వద్ద ఉండి ఘర్షణ వాతావరణం సృష్టించారు. సుమారుగా ఒక గంట పాటు గేటు వద్ద ఉండి నినాదాలు చేస్తూ ప్రజాప్రతినిధులను కార్యాలయంలోకి వెళ్లనీకుండా అడ్డుగా ఉన్నారు. 11 గంటలకు లోపలికి వెళ్లగానే.. ఎంపీడీఓ మాత్రం సమావేశం వాయిదా వేసినట్లు నోటీసు బోర్డు అతికించారు. అంతా ప్లాన్ ప్రకారం జరిగిపోయింది.

అధికారుల నిర్లక్ష్యంతోనే వాయిదా

అధికారులు అధికార పార్టీకి వంతు పలకడంతో మండల్‌మీట్ వాయిదా పడిందని వైఎస్సార్‌సీపీ ఎంపీపీ సాయిలీలా, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, రేష్మా, ఆయిషా అన్నారు. ములకలచెరువులో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమావేశం జరిగేందుకు అధికారులు సహకరించలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను లెక్కచేయకుండా అధికారులు వ్యవహరించడం చట్ట విరుద్ధమన్నారు. శాంతి భద్రతలు అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

మినిట్స్ బుక్ అడిగినా.. కేసులు పెడతారా?

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

ములకలచెరువు : ఇప్పటి దాకా మూడు సార్లు మండల్ మీట్ జరగకుండా కూటమి నాయకులు అడ్డు తగులుతూనే ఉన్నారు... మీరు మాత్రం సమావేశం జరగకుండా అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలను పట్టించుకోరా అంటూ ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై.. ఎంపీడీఓ హరినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాటిమాటికి మండల్‌మీట్ జరగకుండా కూటమి నాయకులు అడ్డు తగులుతుండటంతో.. ములకలచెరువు ఎంపీపీ సాయిలీలా హైకోర్టును ఆశ్రయించి మండల్‌మీట్ జరిగేలా ఉత్తర్వులు తెచ్చారు. గురువారం జరిగేలా అధికారులు సర్క్యులర్ ప్రజాప్రతినిధులకు అందించారు. కానీ ప్రజాప్రతినిధులు కార్యాలయంలోకి వెళ్లనీయకుండా కూటమి నాయకులు వందల సంఖ్యలో గుమికూడి ఉండడంతో.. ఎట్టకేలకు కష్టం మీద వారు వెళ్లారు. అప్పటికే వాయిదా వేశామని ఎంపీడీఓ చెప్పారు. దీనితో మినిట్స్ బుక్ ఇవ్వండి.. సంతకాలు చేస్తామంటూ.. మండల అభివృద్ధిపైన చర్చించడానికి సహకరించాలని కోరిన వారిపై.. అధికారులను అడ్డుపెట్టుకొని కేసులు పెట్టి బయపెట్టడానికి తెగించారు కూటమి నాయకులు. తన విధులకు ఆటంకం కల్పించారు అంటూ, దుర్భాషలాడారంటూ ఎంపీడీఓ హరినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేసేలా చేశారు. ఈ విషయం తెలుసుకున్న మండల ప్రజలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అంటూ కూటమి ప్రభుత్వం పైన అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

రాయచోటి : అప్పుల బాధ తాళలేక బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి ఫకీర్ సాహెబ్ (62) యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పట్టణంలోని మాసాపేటలోని తన స్వగృహంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సీఐ పేర్కొన్నారు. మద్యం, గ్యాంబ్లింగ్, మట్కాలకు బానిసై అప్పులు చేయడంతో కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయ యోగాసన పోటీల్లో ప్రతిభ


ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : జాతీయ యోగాసన పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సంబేపల్లెలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌లో ఎంఈఓ–2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సన్మానించారు. జార్ఖండ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి 31 వరకు 43వ జాతీయ యోగాసన పోటీలు నిర్వహించారు. అన్ని రాష్ట్రాల నుంచి యోగా గురువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పోటీలలో సంబేపల్లె మండలం గొల్లపల్లె ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో ఉపాధ్యాయురాలిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

కేక్ కటింగ్‌కు రాలేదని దాడి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సాలాబాద్ గ్రామం ఎస్సీ కాలనీలో వంగదొడ్డి యానాదమ్మ, మనవడు సుక్కుపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ వివరాల మేరకు.. జనవరి ఒకటో తేదీన సాలాబాద్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో వంగదొడ్డి యానాదమ్మ మనవడు సుక్కు కేక్ కటింగ్‌కు రాలేదని.. అదే కాలనీలో సమీప బంధువులైన సాయి, రాకేష్, నరసింహ, పెంచలయ్య, సుమంత్ అనే ఐదుగురు వ్యక్తులు కక్ష పెంచుకున్నారు. వారు యానాదమ్మ ఇంటిలోకి వెళ్లి యానాదమ్మ, ఆమె మనువడు సుక్కుపై దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డారు. బాధితులు కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వంగదొడ్డి యానాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పైన తెలిపిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అయ్యప్ప దర్శనానికి వెళ్లి వస్తుండగా..

– గుండెపోటుతో భక్తుడి మృతి

పెద్దమండ్యం : అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లి వస్తున్న ఓ భక్తుడు గురువారం గుండెపోటు రావడంతో తనువు చాలించాడు. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం కుమ్మరానిగడ్డ వీధికి చెందిన బుజ్జిరెడ్డి (50) అయ్యప్ప మాల ధరించాడు. శనివారం స్థానిక శివాలయం వద్ద ఇరుముడిని ధరించి స్థానికులైన మరికొంత మంది అయ్యప్ప భక్తులతో కలిసి బస్సులో శబరిమలకు వెళ్లాడు. అక్కడ స్వామి వారిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో.. వస్తూ పళనికి సమీపంలో భోజనం కోసం వాహనం నిలిపారు. అక్కడ నిలుచొని ఉన్న అతను ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సహచర అయ్యప్ప భక్తులు సమాచారం అందించారు.

మౌశాలి పీరు ఉరుసు నిర్వాహకులు..

పెద్దమండ్యం విద్యానగర్ కాలనీలో ఉన్న మౌశాలి పీరు ఉరుసు నిర్వాహకులు, గురువు సుబహాన్ (53) గుండెపోటుతో ఇంటి వద్ద మృతి చెందాడు. పెద్దమండ్యంలో ఒకే రోజు గుండెపోటుతో మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది.

ఫ్లెక్సీ తొలగింపుపై ఘర్షణ

మదనపల్లె : షాపు ముందు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగింపుపై వివాదం రేగి.. ఇరు వర్గాలు ఘర్షణ పడిన ఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బసినికొండకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు ఎస్.ఎం.రఫీ జన్మదిన, నూతన సంవత్సర వేడుకల శుభాకాంక్షలు తెలుపుతూ.. డిసెంబర్ 31న స్థానికంగా ఉన్నటువంటి ముబారక్ కార్ ఏసీ సర్వీసెస్ షాపు ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసే సమయంలో షాపు యజమాని ఆరీఫ్ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. దీనిపై ఆరీఫ్.. రెండు రోజుల తర్వాత తీసేస్తారేమోనని భావించాడు. గురువారం షాపు ఓపెన్ చేసి, ఫ్లెక్సీ అడ్డుగా ఉందని తొలగించాల్సిందిగా రఫీ సోదరుడిని ఫోన్‌లో అడిగాడు. అడ్డుగా ఉంటే తీసి పక్కన పెట్టాల్సిందిగా.. అతడు సూచించాడు. దీంతో ఫ్లెక్సీ తీసి పక్కన ఉంచాడు. అయితే, మధ్యాహ్నం ఎస్.ఎం.రఫీ తన కుమారులతో కలిసి ఆరీఫ్ షాపు వద్దకు వచ్చి ఫ్లెక్సీ ఎందుకు తొలగించావని గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడి ఇరువురికి సంబంధించిన వ్యక్తులు అధిక సంఖ్యలో గుమికూడారు. దీంతో ఆరీఫ్ మరో వ్యక్తితో కలిసి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో తనపై దౌర్జన్యం చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న ఎస్.ఎం.రఫీ వర్గీయులు ఆరీఫ్ వర్గీయులపై దాడికి పాల్పడటంతో గొడవ పెద్దదైంది. సమాచారం అందుకున్న డీఎస్పీ కొండయ్యనాయుడు, తాలూకా సీఐ కళావెంకటరమణ, ఎస్ఐ హరిహరప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లారు. ఇరువర్గాలతో చర్చించి గొడవ సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. స్టేషన్‌కు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. దీంతో ఇరు వర్గాలవారు తాలూకా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు.


సంఘటన స్థలంలో సంబంధీకులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి


బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వినతి పత్రం అందిస్తున్న కురుబ సంఘం నాయకులు

మదనపల్లె : రాష్ట్ర వ్యాప్త బీసీ కులాల్లో అత్యధిక జనాభా కలిగిన కురుబలకు నామినేటెడ్, పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి వినతిపత్రం సమర్పించినట్లు ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమలో అనేక పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగిన సత్తా కురుబలకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో కురుబలకు 1 ఎమ్మెల్యే, 2 ఎంపీ, మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, నామినేటెడ్ పదవుల్లో బీజేపీ తరపున కురుబ కులానికి చెందిన ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సభ్యులుగా, కురుబ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా పలువురికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కురుబల సమస్యలను ప్రస్తావించారు. గుడికట్ల పూజారులు, గొరవయ్యలకు రూ.10 వేల గౌరవవేతనం ఇవ్వాలన్నారు. తిరుమలలో కనకదాస భవన నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం, తగిన మొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కురుబలకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సీటు కేటాయించాలన్నారు. గొర్రెలకు, గొర్రెలకాపరులకు ప్రభుత్వం తరపున బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో గొర్రెల పెంపకానికి రుణాలు కేటాయించి సబ్సిడీ ఏర్పాటు చేయాలన్నారు. బీజేపీ తరపున ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో రాబోవు కాలంలో కురుబలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వళికేరి లింగమూర్తి, అధికార ప్రతినిధి చిరుతల విఠల్‌గౌడ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణంరెడ్డిపల్లె కాటమయ్య, దండుకేశవ, బండికాశి, వళికేరిశివ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల లీజు చెల్లించకపోతే చర్యలు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

రామసముద్రం : మండలంలోని దేవాలయ భూముల లీజులను రైతులు సకాలంలో చెల్లించకపోతే, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ హెచ్చరించారు. గురువారం కాప్పల్లె పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్చకుల ఫిర్యాదు మేరకు రామసముద్రంలోని శ్రీ చంద్రశేఖరస్వామి, శ్రీలక్ష్మీజనార్దనస్వామి, శ్రీవాలీశ్వరస్వామి, దుర్గలమ్మ, బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి తదితర ఇంకా పలు ఆలయాల మాన్యం భూములు వేలంలో లీజుకు తీసుకున్న రైతులు నగదు చెల్లించకపోతే తిరిగి భూములను వేలం వేస్తామన్నారు. అర్చకులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, లీజు రైతులు నగదు చెల్లించి దేవాలయాల అభివృద్ధి కోసం సహకరించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, తహసీల్దార్ నిర్మలాదేవి, దేవదాయశాఖ ఈఓ రమణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వీఆర్వోపై ఫిర్యాదు


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మద్దయ్యగారిపల్లిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో వీఆర్వోపై రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇక్కడ వీర్వోగా పని చేసి ఇటీవల బదిలీపై కురబలకోట మండలానికి వెళ్లిన మహిళా వీఆర్వో వ్యవహారశైలిపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాల ముటేషన్ల కోసం తమ వద్ద డబ్బులు తీసుకుని పాసు పుస్తకాలు చేయకుండా మమ్మల్ని నిలువునా ముంచేసిందని, సెల్‌ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని వారు మండిపడ్డారు. బురుజుపల్లిలో అవ్వ పేరున ఉన్న భూమిని మనవళ్ల పేరుతో మార్చడానికి తన వద్ద రూ.7 వేల నగదు తీసుకుందని రాజారెడ్డి, కొనుగోలు చేసిన భూమిని ముటేషన్ కోసం రూ.9 వేలు తీసుకుందని కాకిమారుపల్లికి చెందిన శంకర్, తన వద్ద కూడా రూ.3 వేలు తీసుకుందని మరో రైతు ఇలా చాలా మంది వద్ద వీఆర్వో చేతివాటం ప్రదర్శించి బదిలీపై వెళ్లిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవలంపేటకు చెందిన భాస్కర్‌రెడ్డి అనే రైతు మాట్లాడుతూ ఊరిలో ఇల్లు కట్టుకుందామని తనకు ఉన్న భూమి కొలతలు వేయడానికి సర్వే కోసం చలానా కట్టి ఏడాది గడచినా ఇంత వరకు రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, దీంతో తాను గత్యంతరం లేక వేరే చోట ఇల్లు కట్టుకునే దుస్థితి నెలకొందని వాపోయాడు.

ఆస్పత్రి ఎదుట మృతదేహంతో నిరసన


ఆస్పత్రి అత్యవసర విభాగం వద్ద నిరసన తెలియజేస్తున్న మృతుడి బంధువులు

తంబళ్లపల్లె : అత్యవసర వైద్య చికిత్సల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే సిబ్బంది అంబులెన్స్‌లో నుంచి రోగిని.. ఆస్పత్రిలోకి తరలించడానికి కూడా రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతదేహంతో బంధువులు నిరసన తెలిపిన సంఘటన తంబళ్లపల్లెలో గురువారం జరిగింది. బాధితుల కథనం మేరకు... తంబళ్లపల్లె మండలం ఉప్పులూరివాండ్లపల్లెకు చెందిన శ్రీరాములునాయక్(58) శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో 108 అంబులెన్స్ వాహనంలో తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో రోగిని అంబులెన్స్‌లో నుంచి దించి ఆస్పత్రిలోకి తీసుకెళ్లడానికి ఆస్పత్రి సిబ్బంది ఎవరూ రాలేదన్నారు. కొంత సేపటి తరువాత వైద్యులు వచ్చి రోగిని పరీక్షించి అప్పటికే (మార్గంమధ్యలోనే) మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. అత్యవసర సమయాల్లో 108 వాహనంలో ఆస్పత్రికి వచ్చే రోగులను కూడా సిబ్బంది పట్టించుకోవడం లేదని, ఇంత పెద్ద ఆస్పత్రిలో రోగులకు ఇక వైద్యం ఏం అందుతుందని మృతుడి అల్లుడు మాజీ సర్పంచి రమణానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు.

'గంగమ్మా.. వాన కురిపించమ్మా'


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజంపేట టౌన్ : గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసి.. ఆయా ప్రాంతాల్లో చెరువులు నిండి అలుగులు పార్లాయి. అయితే రాజంపేటలో ఉన్న ఎనిమిది చెరువుల్లో పోలి చెరువుకు ఓ మోస్తారు నీళ్లు రావడం మినహా, మిగతా చెరువుల్లోకి చుక్కనీరు చేరలేదు. దీంతో గురువారం మండలంలోని తుమ్మల అగ్రహారం గ్రామంలో స్వయంభుగా వెలసిన గంగమ్మకు ఆ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున సల్ల వేడుక నిర్వహించారు. తొలుత గంగమ్మ సోదరి అయిన అంకాలమ్మకు విశేషంగా పూజలు నిర్వహించారు. ఊరేగింపుగా సల్లను తీసుకుపోయి గ్రామానికి నలుదిక్కుల ఉన్న పొలిమేర్లలో పోశారు. అనంతరం గంగమ్మ స్వయంభు వద్ద పెద్దఎత్తున రెండు గంటల పాటు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మా.. రాజంపేటలో వర్షాలు కురిపించి చెరువులు నిండేలా చూడు తల్లి అంటూ భక్తులు వరపడ్డారు. ఈ ఏడాది చెరువులు నిండితే ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తామంటూ మొక్కుకున్నారు. సల్ల వేడుకలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడంతో అగ్రహారం గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేయడంతోపాటు సల్లను పంపిణీ చేవారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసినా రాజంపేటలో సరైన వర్షాలు కురవక పోవడం వల్ల గంగమ్మ కరుణ కోసం సల్ల వేడుకను నిర్వహించినట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మందికి గాయాలు


గాయపడ్డ వేదాంత్

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. ఆటో బోల్తా పడి ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ కోటకాడపల్లెకు చెందిన వేదాంత్(19), చిన్నమండ్యంకు చెందిన భరత్(19) కురబలకోట మండలం విశ్వం కాలేజ్‌లో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. గురువారం మదనపల్లె మండలంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలకు హాజరయ్యేందుకు మరి కొందరు విద్యార్థులతో కలిసి ఆటోలో బయలుదేరారు. ఆదిత్య కాలేజ్ సమీపంలో వేగంగా వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వేదాంత్‌కు కడుపులో రాడ్ గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. భరత్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం వేదాంత్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

- కురబలకోట మండలం చేనేతనగర్‌కు చెందిన గంగులరెడ్డి(55) వ్యక్తిగత పనులపై గుర్రంకొండకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలోని ముదివేడు టోల్ ప్లాజా వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగులరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.
- మదనపల్లె ఎస్టేట్‌లో నివాసం ఉంటూ స్థానికంగా పని చేస్తున్న అస్సాంకు చెందిన యువకులు ఆపస్(25), ధీరజ్(24), కరుణ్(25)లు రాత్రి పట్టణంలోకి వచ్చి పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఎస్టేట్‌కు వెళుతుండగా, బసినికొండ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు.
- పట్టణంలోని బీకే.పల్లెలో నివాసం ఉంటున్న ఫిరోజ్(22) ద్విచక్రవాహనంలో పుంగనూరు రోడ్డుకు వెళ్లి తిరిగి వస్తుండగా, బసినికొండ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.
- ఆయా ఘటనల్లో బాధితులను గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి..

నిమ్మనపల్లె : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం బుగ్గకాలువకు చెందిన నారాయణ(38) ట్రాక్టర్‌లో సొంతపనులపై నిమ్మనపల్లెకు వెళ్లి తిరిగి మదనపల్లెకు వస్తుండగా, మార్గంమధ్యలోని ముష్టూరు పంచాయతీ మర్రిబండవద్ద కారు ఎదురుగా రావడంతో, వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో నారాయణ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ రెడ్డిజస్వంత్, పైలట్ సద్దాం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..


గాయపడిన లక్ష్మీనారాయణ

సిద్దవటం : మండల పరిధి భాకరాపేట గ్రామ సమీపంలోని రాజస్తాన్ డాబా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం మోదీన్‌సాబ్‌పల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో గురువారం రాత్రి కడప నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. భాకరాపేట గ్రామ సమీపంలోని రాజస్తాన్ డాబా వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన లక్ష్మీనారాయణను వైద్య కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

- కడప–రేణిగుంట హైవే నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం
- రాజ్యసభ సభ్యుడు మేడారఘునాథరెడ్డి



రాజంపేట : జాతీయ రహదారుల్లో జరిగే ప్రమాదాల నివారణపై కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలో రహదారి ప్రమాదాల వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారని, చాలా మంది వికలాంగులుగా మారుతున్నారని, పరోక్షంగా అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయన్నారు. ప్రధానంగా రహదారి భద్రత అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్(ఎన్ఆర్ఎస్ఐ) కార్యక్రమాన్ని జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహిస్తోందని, అందరి భాగస్వామ్యంతో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమాన్ని తెరపైకి తీసుకొచ్చిందన్నారు.

కడప–రేణిగుంట హైవే నిర్మాణ పనులపై కేంద్రమంత్రి హామీ

కడప–రేణిగుంట హైవే నిర్మాణ పనులపై కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి తెలిపారు. ఇటీవల తాను, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిలు కేంద్ర మంత్రిని కలిసి కడప–రేణిగుంట హైవే నిర్మాణం జాప్యం కొనసాగుతోందని, త్వరగా పనులు చేపట్టాలని కోరామన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వివరించారు. పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి తమకు హామీ ఇచ్చారన్నారు. అలాగే అటవీ పర్యావరణ అనుమతులు ఆలస్యం అవుతుండటంతో కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్‌ను కూడా కలిసి అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కోరామన్నారు. ఇప్పటికే అటవీ శాఖ అనుమతులు ఇచ్చారన్నారు. పర్యావరణ అనుమతులు కూడా త్వరలో ఇచ్చేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. కాగా కడప–రేణిగుంట జాతీయ రహదారి (పాతరోడ్డు)చాలా అధ్వానంగా ఉందని.. పెద్ద, చిన్న గుంతలను పూడ్చాల్సిన బాధ్యత ఎన్‌హెచ్ఏఐకి ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునాథరెడ్డి హితువు పలికారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్: 79821 14647

WANTED

■ శ్రీవేన డీలక్స్ డార్మెంటరీ A/C నందు రిసెప్షన్ మరియు మెంటైనెన్స్ చేయుటకు ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారు కావలెను. భోజనం+వసతి ఫ్రీ. జ్యోయాలుక్కాస్ జ్యువెలర్స్ ప్రక్కన, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, కడప. సంప్ర: 7799887798, 8297649798

■ కడప నగరంలోని UTI ITSL IT PAN CARD నందు అటెండర్ గా పనిచేయుటకు 10 వ తరగతి చదివిన 25 సం॥ వయస్సు కలిగిన యువతి కావలెను. సంప్ర : డి.నెం: 21/-10, తిరుమల ఆసుపత్రి దగ్గర ఆర్.యస్.రోడ్ LED ప్రక్కన, కడప

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693

■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్ ఫ్రం హోం. స్త్రీ పురుషులు కావలెను. Qul: 10- డిగ్రీ, మంచిజీతం,ఉచిత రూము భోజనసదుపాయం.9353453795, 9036607717

■ Free Jobs: HR Recruiter, BDM, Tele Callers, Counsellors, Attenders తిరుపతిలోని ప్రముఖ సంస్థ కొరకు కావలెను. జీ+ ఇన్సెంటివ్స్: 15–30వేలు. 99499 42245.

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409